సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



సమాజ భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి

ప్రజలు సమాజ అభివృద్ధిలో భాగస్వాములైనప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని వైవీయూ వీసీ జింక రంగ జనార్ధన పేర్కొన్నారు. -8లో..



ఈఈఎంటీ ఫలితాల్లో మనమే ఫస్ట్

శుక్రవారం విడుదలైన ఈఈఎంటీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. -8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35.7/15.8

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 15.8 - 35.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోండి

కడప సిటీ : 24 గంటలూ అందుబాటులో ఉండేలా 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను కలెక్టరేట్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన తదితర విషయాలు, ఇతర సమస్యలను కూడా ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పవన్‌కుమార్ నామినేషన్



రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పట్టుపోగుల పవన్‌కుమార్

వైవీయూ: పశ్చిమ రాయలసీమ నియోజక వర్గం శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పట్టుపోగుల పవన్‌కుమార్ శుక్రవారం తొలి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతపురంలో రిటర్నింగ్ ఆఫీసర్ కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ఈయన 'బ్లడ్ టు లివ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రక్తదాన ఉద్యమం, సేవలు అందించారు. ఈయన వెంట సీఆర్‌ఐ సునీల్ జయంత్, సురేష్, కార్తీక్, రవి, తేజయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహాశివరాత్రిని పురస్కరించుకుని శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కడప డిపో నుంచి 120 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. వీటిలో పొలతలకు 80, కడప నుంచి నిత్యపూజకోనకు 15, సిద్దవటం నుంచి నిత్యపూజకోనకు 25 బస్సు లను ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పొలతల, నిత్యపూజకోనలకు ఛార్జి కింద రూ. 80 వసూలు చేస్తున్నామని వివరించారు. ఈ బస్సులు కడప ఆర్టీసీ బస్టాండు నుంచి పాత బస్టాండు, ఐటీఐ సర్కిల్, మూలవంక మీదుగా పొలతలకు, అలాగే పాత బస్టాండు, అప్సర సర్కిల్, భాకరాపేట మీదుగా నిత్యపూజకోనకు వెళతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ గోవర్ధన్‌రెడ్డి, కంట్రోలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎస్ఎస్ సొల్యూషన్స్, టీఎంఎస్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 22వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి కడప నగరం కో ఆపరేటివ్ కాలనీ ఎస్‌బీఐ వద్ద ఉన్న ఎస్ఎస్ సొల్యూషన్ ట్రైనింగ్‌సెంటర్‌లో జాబ్‌మేళా ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ, డిప్లొమా ఇంజనీరు ట్రైనీ, బీటెక్, డిప్లొమా, ఐటీఐలలో ఈసీఈ, ఈఈఈ ఉత్తీర్ణులైన వారు, అసెంబ్లీ ఆపరేటర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియేట్, డిగ్రీ చదివి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 81060 59836, 70954 99870 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిరంతరాయంగా నడిచిన ఆర్టీపీపీ ఐదోయూనిట్



కేక్ కట్ చేస్తున్న ఆర్టీపీపీ ఎస్ఈ దేవేంద్రనాయక్, అధికారులు, ఇంజినీర్లు

ఎర్రగుంట్ల: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ)లోని 5వ యూనిట్ నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తిని సాధిస్తూ వంద రోజులు పూర్తి చేసుకుని హ్యాట్రిక్ సాధించిందని ఆర్టీపీపీ ఎస్ఈ దేవేంద్రనాయక్ అన్నారు. శుక్రవారం ఆర్టీపీపీ సీఈ మురళీకృష్ణ సారథ్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీపీపీ ఎస్ఈ మాట్లాడుతూ 5వ యూనిట్ వందరోజులు నిరంతరాయం నడిచిందన్నారు. 2010 నవంబర్‌లో 5వ యూనిట్‌ను ప్రారంభించారు. 2011 ఫిబ్రవరిలో సీవోడి పూర్తి చేసి విద్యుదుత్పత్తి చేపట్టినట్లు చెప్పారు. ఈ నెల 12వ తేదీ నాటికి వంద రోజులు పూర్తిగా నడిచిందన్నారు. ఇది ఆల్‌టైం రికార్డు అన్నారు. దీనికి ఆర్టీపీపీ 5వ యూనిట్‌లో పనిచేస్తున్న అందరి కృషి ఉందన్నారు.

హరహర మహాదేవ..

- నేడు మహాశివరాత్రి
- శైవ క్షేత్రాల్లో ఘనంగా ఏర్పాట్లు
- కొండ కోనలకు భక్తజనం



నాగనాథేశ్వరుడు



నాగనాథేశ్వరకొండ వ్యూ

కడప కల్చరల్ : శివుడు..భోళాశంకరుడు..ఆకు, పండు, పువ్వు, నీరు ఇలా ఏదీ ఇచ్చి మనసారా మొక్కినా భక్తులను కరుణిస్తాడు..వరాలు కురిపిస్తాడు..ఆపదలో ఆదుకుంటాడు..అందుకే ఆయన భక్తవ శంకరుడు. అలాంటి మహాశివరాత్రి భక్తులకు ఎంతో ముఖ్యమైనది. ఈ పండుగను నిర్వహించుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. నిర్వాహకులు శివాలయాలను అందంగా తీర్చిదిద్దారు. జిల్లాలో ప్రముఖ శివాలయాలు అందులోనూ అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆలయాల సంఖ్య 15కు పైగానే ఉంది. దీంతో తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా శివరాత్రి సందర్భంగా భక్తులు జిల్లాకు వస్తుంటారు. పుష్పగిరి, చిట్వేలి, దేవుని కడప తదితర ప్రాంతాల్లో శైవ, వైష్ణవ ఆలయాలు పక్కపక్కనే ఉన్నాయి. నిత్యపూజస్వామిని భక్తులు వైష్ణవ సంప్రదాయంలోనే అర్చిస్తారు. అడుగడుగునా గోవింద నామస్మరణ చేస్తారు. ఈ సంవత్సరం పండుగ శనివారం రావడంతో భక్తులు మరింత ఉత్సాహంగా ఉన్నారు. మహాశివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో సోమవారం పూజలు నిర్వహించడానికి జిల్లా దేవదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, పంచాయతీరాజ్, అగ్నిమాపకశాఖ, పోలీసు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్యశాఖ శాఖల సహకారంతో ఇప్పటికే పలుమార్లు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలను పరిశీలించారు. పోలీసు అధికారులు కూడా తమ పరిధిలోని శైవ క్షేత్రాలకు బందోబస్తు కోసం తరలివెళ్లారు. భక్తులు శుక్రవారం ఉదయం నుంచే అటవీ క్షేత్రాల బాటపట్టారు. మొక్కులుగల భక్తులు ప్రత్యేక వాహనాలను ఉచితంగా ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. శుక్రవారం మధ్యాహ్నానికే అటవీ ప్రాంతాల దారులు జనమయం అయ్యాయి. సాయంత్రానికి ఆయా క్షేత్రాలు భక్తులతో రద్దీగామారాయి. శివనామ స్మరణతో ఆయా క్షేత్రాలు మార్మోగాయి.

భక్తజన ప్రవాహం

శివరాత్రి సందర్భంగా శివయ్యకు విశేష పూజలు నిర్వహించనున్నారు. జిల్లాలో లక్షల మంది హాజరయ్యే క్షేత్రాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పొలతల, నిత్యపూజస్వామికోన, అత్తిరాల, భైరవకోన, గుండాల కోన, కపర్థీశ్వరకోన, కన్యతీర్థం, భానుకోట, నాగనాథేశ్వరకొండ తదితర ప్రాంతాలకు భక్తులు భారీగా హాజరవుతారు. కొండకు వెళ్లే భక్తులకు ధార్మిక సంఘాల ప్రతినిధులు ఆహార పొట్లాలు, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నారు. దాదాపు అన్ని ఆలయాలలో పండుగ సందర్భంగా శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నారు. రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు భజనలు, ప్రవచనాలు, భక్తి గీతాలాపనలు నిర్వహించనున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి లింగోద్భవం సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు.



పొలతలలో బందోబస్తు గురించి పోలీసులకు దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అత్తిరాలలో ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ వెలుగుల్లో అత్తిరాలలోని త్రేతేశ్వర ఆలయం

రాజంపేట రూరల్: అన్నమయ్య జిల్లాలోని శైవ క్షేత్రమైన అత్తిరాలలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. శివరాత్రి నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ కొలువుదీరిన కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామిని దర్శించుకునేందుకు దాదాపు లక్ష మంది భక్తులు ప్రతి ఏడాది వస్తుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ జీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో రూరల్, అర్బన్ సీఐలు పుల్లయ్య, నరసింహులుల ఆద్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మహాశివరాత్రిని పురస్కరించుకొని 3,108 టెంకాయలతో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజంపేటశాఖ ఆధ్వర్యంలో 9 అడుగుల ఎత్తుగల శివలింగాన్ని ఏర్పాటు చేశారు. 3వేలకు పైగా టెంకాయలతో శివలింగం ఏర్పాటు చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే.సావిత్రి తెలిపారు. సంస్థ ప్రతినిధులు శివకేశవులు, వీ.నాగరాజు, పీ.సంతోష్‌కుమార్, చలపతి, రాజేశ్వరి ఈ శివలింగాన్ని తయారు చేసినట్లు తెలిపారు. -రాజంపేట టౌన్

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు

పులివెందుల : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు అని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు జగనన్న 'గడప గడపకు మన ప్రభుత్వం' అనే కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేసినందుకే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ప్రతి గడపకు గర్వంగా వెళ్లగలుగుతున్నామన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతుంటే.. మరోపక్క ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా పనిగట్టుకొని దుష్ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. జిల్లాలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో ఇప్పటికే పెను మార్పులను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన స్టీల్ ప్లాంటు నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అనంతరం ఆయన తన వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఫోన్ల ద్వారా తెలియజేశారు.

జిల్లా ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

కడప కార్పొరేషన్: మహా శివరాత్రి పర్వదినాన ప్రతి ఒక్కరి కోరికలు నెరవేరాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివుని అనుగ్రహం జిల్లా ప్రజలపై మెండుగా ఉండాలని, ప్రతి కుటుంబంలోనూ సంతోషాలు వెల్లివిరియాలన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

సిద్దవటం: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు వైద్య సిబ్బందికి సూచించారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా మురుగు నీటి నిల్వలను, ఇళ్ల సమీపంలోని డ్రమ్‌లలో నిల్వ ఉన్న నీటిని ఆయన పరిశీలించారు. దోమలు పుట్టకూడదు, కుట్టకూడదు అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.



భాకరాపేటలో డ్రమ్‌లో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

క్రీడలతో మానసిక ఉల్లాసం : కలెక్టర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ వి. విజయరామరాజు

టెన్నిస్ చాంపియన్‌షిప్ ప్రారంభం

కడప స్పోర్ట్స్: కడపలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆలిండియా సీనియర్స్ నేషనల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక, శారీరక ఉత్సాహం కలుగుతుందన్నారు. వయసుతో సంబంధం లేకుండా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు కడప వేదికగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కడప ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి యదుభూషణ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు జీవా విలియమ్స్, మామిళ్ల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనుల జోరు!

- జిల్లాలో ప్రారంభమైన వాటర్‌షెడ్ పనులు
- ప్రస్తుతం జరుగుతున్న ఈపీఏ, ఎన్ఆర్ఎం పనులు



మేకవారిపల్లెలో ఏర్పాటు చేసిన ఫారంపాండ్



వంతాటిపల్లె వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్

కడప సిటీ: జిల్లాలో ఆయా మండలాల్లో వాటర్‌షెడ్ పనులు ఊపందుకున్నాయి. ప్రధానమంత్రి కృషి సంచయీ యోజన (పీఎంకేఎస్‌వై) ద్వారా వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ (డబ్ల్యుడీసీ) పేరుతో వివిధ పనులు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన పనులకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు వెచ్చిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తోంది. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 37 మైక్రో వాటర్‌షెడ్ పనులు నిర్వహించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఇప్పటికే కొన్ని మండలాల్లో ప్రాదేశిక కార్యక్రమం (ఎంట్రీ పాయింట్ యాక్టివిటి-ఈపీఏ), సహజ వనరుల అభివృద్ధి (ఎన్ఆర్ఎం- నేచురల్ రీసోర్స్ మేనేజ్‌మెంట్) ద్వారా పనులు జరుగుతున్నాయి. మొత్తం బడ్జెట్ ఐదేళ్ల కాలంలో (2021-22, 2025-26 వరకు) పనులు నిర్వహించాల్సి ఉంది. ఇందులో ఈపీఏ ఎన్ఆర్ఎం, జీవనోపాధుల పెంపుదల తదితర పనులు ఈ ఐదేళ్ల కాలంలో చేసేందుకు రూ. 87.14 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంది.

జిల్లాలోని తొమ్మిది మండలాల్లో పనులు

వాటర్‌షెడ్ కింద పనులు చేసేందుకు జిల్లాలోని తొమ్మిది మండలాలను ఎంపిక చేశారు. బద్వేలు, బి.కోడూరు, మైదుకూరు, బి.మఠం, ముద్దనూరు, సిద్ధవటం, లింగాల, తొండూరు, వేముల, వీఎన్ పల్లె మండలాల్లోని చింతలచెరువు, పలుగురాళ్లపల్లె, పెద్దుళ్లపల్లె, జ్యోతి, సంతకొవ్వూరు, బోనాల, నల్లచెరువుపల్లె, బందలకుంట, ఎన్.పాలగిరి గ్రామాల్లో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

ప్రాదేశిక కార్యక్రమం


ప్రాదేశిక కార్యక్రమం (ఎంట్రీపాయింట్ యాక్టివిటి-ఈపీఏ) ద్వారా ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను వాటర్‌షెడ్ ద్వారా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సిమెంటు బెంచీలు (సచివాలయాలు, దేవాలయాలు), ఆటోస్టాండ్లు, పశువులకు నీటి తొట్లు, పశు వైద్య శిబిరాలు, పైపులైన్లు, విద్యార్థులకు డైనింగ్ హాల్స్, సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగాను 161 పనులకు రూ. 1.60 కోట్లకు అనుమతులు వచ్చాయి. ఇందులో 41.86 లక్షల పనులు జరిగాయి.

సహజ వనరుల అభివృద్ధి

సహజ వనరుల అభివృద్ధి (నేచురల్ రీసోర్స్ మెనేజ్‌మెంట్-ఎన్ఆర్ఎం) కింద వివిధ అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. కందకాలు, కండిత కందకాలు, రాతి కట్టడాలు, చెక్‌డ్యాములు, పర్కులేషన్ ట్యాంకులు, చెక్‌వాల్వ్‌లు, రైతులకు పంట నూర్పిడి కల్లాలు తదితర అభివృద్ధి పనులను చేస్తున్నారు. ఈ పథకానికి సంబంధించి 2022-23 ఆర్థిక సంవత్సరానికి 483 పనులకు గాను రూ. 16.73 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం రూ. 9.92 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, రూ. 69.94 లక్షలు ఖర్చు చేశారు.

39,613 హెక్టార్లలో పనుల నిర్వహణ

ఎంపికైన తొమ్మిది మండలాల్లోని తొమ్మిది గ్రామాల్లో 39,613 హెక్టార్లలో వాటర్‌షెడ్ పనులు నిర్వహించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 22 వేల హెక్టార్లను గుర్తించారు. ఇందుకుగాను రూ. 87.14 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి మొత్తం బడ్జెట్‌కు ప్రణాళికలు రూపొందించారు. పరిపాలన అనుమతులు కూడా వచ్చాయి. అయితే వివిధ రకాల పనులు చేయాల్సి ఉండడంతో ప్రస్తుతం ప్రాదేశిక కార్యక్రమం కింద పనులు సహజ వనరుల అభివృద్ధి కింద జరుగుతున్నాయి.



ఐదేళ్లలో అన్ని పనులు పూర్తి



వాటర్‌షెడ్ కింద చేయాల్సిన పనులన్నీ ఐదేళ్ల కాలంలో పూర్తి చేస్తాం. ప్రస్తుతం ఎన్ఆర్ఎం, ఈపీ కింద పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర అధికార బృందం కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఉన్న బడ్జెట్‌లో అన్ని అభివృద్ధి పనులు చేసి ప్రజలకు మేలు జరిగేలా ప్రణాళికలు రూపొందించాము.
– యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప సిటీ : ఇంటర్మీడియెట్ జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఇంటర్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఈ నెల 20 నుంచి మార్చి 7 వ తేదీ వరకు, జనరల్ కోర్సులకు సంబంధించి ఈ నెల 26 నుంచి మార్చి 7 వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుండి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో 72 కేంద్రాల్లో జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు, 19 కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సిద్ధం చేసినట్లు చెప్పారు. కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఆర్‌ఐఓ ఎస్‌వి రమణ రాజు మాట్లాడుతూ ఈ పరీక్షల కోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలు మూసివేసేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు సహకరించాలన్నారు. ఆర్‌ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏదైనా సమాచారం కోసం 08562-244171 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు పోలీసు, ఏపీఎస్ ఆర్టీసీ, విద్యుత్ శాఖల అధికారులు, పరీక్షల కమిటీ సభ్యులు ప్రకాష్, సుబ్రమణ్యం,వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేసు కొట్టివేత

లక్కిరెడ్డిపల్లి : సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా వైఎస్ కొండారెడ్డిపై కేసును శుక్రవారం లక్కిరెడ్డిపల్లె ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి శారద కొట్టివేసినట్లు సమాచారం. ఎస్‌ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టరును బెదిరించారన్న ఆరోపణలపై గత ఏడాది మే 9న చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. ఎటువంటి సాక్ష్యాధారాలు లేని కారణంగా ఈ కేసును శుక్రవారం కొట్టివేసినట్లు పోలీసువర్గాలు ధృవీకరించాయి.

ట్రాక్టర్, లారీ ఢీ

– ట్రాక్టర్ డ్రైవర్ కం ఓనర్ మృతి

మార్కాపురం : ట్రాక్టర్‌–లారీ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ కం ఓనర్ మృతిచెందిన సంఘటన శుక్రవారం వేకువజామున మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా దువ్వూరు మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన దిద్దికుంట రామచంద్రుడు (47) తెలంగాణలో ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్‌ను ఏపీలో తన పేరుమీద మార్చుకునేందుకు గురువారం ట్రాక్టర్ తీసుకుని తెలంగాణలోని కోదాడ వెళ్లాడు. అక్కడ పనిచూసుకుని స్వగ్రామం బయలుదేరాడు. శుక్రవారం వేకువజామున 3 గంటల సమయంలో మార్కాపురం మండలం తిప్పాయపాలెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ వద్దకు రాగానే.. బళ్లారి నుంచి తాడేపల్లిగూడేనికి చింతపండు లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా రాంగ్‌రూట్‌లో వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో రామచంద్రుడు రోడ్డుపక్కనే పడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

ఆపద మిత్రల శిక్షణ ముగింపు



సర్టిఫికెట్లు అందుకున్న ఆపదమిత్రలతో అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు ఆపద మిత్రలకు 12 రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించిన సమావేశంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రకృతి విపత్తుల సమయాల్లో భారీ ప్రాణ, ఆస్తినష్టాలు సంభవించకుండా ఆపద మిత్రలు తమ సేవలను వినియోగించాలని తెలిపారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవపై ఆసక్తి గల యువతకు తెలియజెప్పాలని కోరారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ నాగభూషణం రెడ్డి, కో ఆర్డినేటర్ డాక్టర్ సి.వెంకటేశు, ప్రభాకర్, వల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

రాజంపేట టౌన్ : మండలంలోని మందపల్లె అరుంధతివాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దాసరి వెంకటేశును సస్పెండ్ చేస్తూ డీఈఓ ఎద్దల రాఘవరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశు రెండేళ్లుగా పాఠశాలకు సక్రమంగా హాజరు కాకపోవడం, పాఠశాలకు వచ్చినా విద్యార్థులకు చదువు చెప్పకుండా ఫోన్‌లో మాట్లాడుతుండటం, లేకుంటే కుర్చీలో కూర్చొని నిద్రపోవడం, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడే తీరు కూడా బాగా లేదని ఆ పాఠశాల కమిటీ చైర్మన్, గ్రామస్తులు డీఈఓకు ఫిర్యాదు చేశారని ఎంఈఓ వెంకటేష్‌నాయక్ తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు తాము విచారణ చేపట్టి నివేదికను పంపగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

ఈఈఎంటీ ఫలితాల్లో మనమే ఫస్ట్

రాష్ట్ర స్థాయిలో 7, 10వ తరగతి విద్యార్థులు ప్రథమ స్థానం



జశ్వంత్, 10వ తరగతి



హఫీజున్, 10వ తరగతి



వీర ఉదయశ్రీ, 7వ తరగతి

కడప ఎడ్యుకేషన్ : ఈఈఎంటీ ఫలితాల్లో మన జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా 2023 జనవరి 31న ఆన్‌లైన్‌లో జరిగిన ఎడ్యుకేషనల్ ఏపీ పణి(ఈఈఎంటీ) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి.7, 10వ తరగతుల 55 వేల మంది విద్యార్థులు పోటీపడ్డారు. వారిలో రాష్ట్ర స్థాయిలో ముగ్గురిని, ప్రతి జిల్లాకు ముగ్గురిని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేశారు. ఇందులో రాష్ట్ర స్థాయిలో పదో తరగతి విభాగంలో పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సీవీ సాయి జశ్వంత్ ప్రథమ స్థానం సాధించాడు. ఇందుకు గాను ఈ విద్యార్థి రూ.30 వేల నగదు బహుమతికి ఎంపికయ్యాడు. 7వ తరగతి విభాగంలో మైదుకూరు మండలంలోని శెట్టివారిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వీర ఉదయశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ విద్యార్థిని రూ.20 వేల నగదు బహుమతికి ఎంపికైంది.

జిల్లా స్థాయిలో..

జిల్లా స్థాయిలో పదో తరగతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వరుసగా నందిమండలం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ హఫీజూన్, కడప నాగరాజుపేట మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన వెంటక గౌతమ్, ఎర్రగుంట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సుప్రియ సాధించారు. ఇందుకు గాను వీరికి ప్రథమ స్థానానికి రూ. 8 వేలు, ద్వితీయ స్థానానికి రూ.6 వేలు, తృతీయ స్థానానికి రూ.4 వేల నగదు బహుమతి ఇవ్వనున్నారు.

7వ తరగతిలో..

జిల్లా స్థాయిలో 7వ తరగతి విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలను వరుసగా ప్రొద్దుటూరు రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన లలిత, తొండూరు మండలం మల్లెల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సౌమ్యరెడ్డి కైవసం చేసుకున్నారు. వీరిలో ప్రథమస్థానానికి రూ.5 వేలు, ద్వితీయ స్థానానికి రూ. 4 వేలు నగదు బహుమతిని అందజేయనున్నారు.

రాష్ట్రంలో ప్రథమ స్థానం రావడం సంతోషం : డీఈఓ

ఈఈఎంటీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మన జిల్లాకు చెందిని విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. ఈ విషయంలో దగ్గరుండి అందరినీ సన్నద్ధం చేసిన జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డికి అభినందనలు.

– దేవరాజు, డీఈఓ

అందరికీ కృతజ్ఞతలు

కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు జరిగిన ఈఈఎంటీ –2023 పరీక్షల్లో ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు. విద్యార్థులు సత్తా చాటినందుకు ఆనందంగా ఉంది.

– మహేశ్వరరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

సమాజ భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య జింక రంగ జనార్ధన

వైవీయూ : ప్రజలు చైతన్యవంతులై సమాజ అభివృద్ధిలో భాగస్వాములైనప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్ధన పేర్కొన్నారు. వైవీయూలో 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో యువత భాగస్వామ్యం' అన్న అంశంపై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్‌కు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ శిక్షణ ఫలాలు క్షేత్రస్థాయికి చేర్చాలని ఎన్ఎస్ఎస్ పీఓలకు సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్ఎస్ఎస్ పీఓలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకటరామిరెడ్డి, రీసోర్స్‌పర్సన్‌లు ఇషానిషేన్, నవ్యరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

సముద్ర శాస్త్రవేత్తలకు పునాది పరిశోధన గ్రంథం

సముద్ర తీర ప్రాంతాలకు సంబంధించిన పాఠ్యాంశాలను సంకలన పరిచి ఒక పుస్తక రూపంలో భూవిజ్ఞానశాఖ ఆధ్వర్యంలో తీసుకురావడం దక్షిణ భారతదేశంలోనే తొలి ప్రయత్నమని, ఈ పుస్తకం సముద్ర శాస్త్రవేత్తలకు ఒక పునాది లాంటిదని వైవీయూ వీసీ ఆచార్య జింక రంగ జనార్ధన అన్నారు. 'సముద్ర తీరప్రాంతాలు, నదులు, సరస్సులు– సుస్థిర అభివృద్ధి' అన్న అంశంపై జియాలజీశాఖ ఆచార్యులు ఎస్.జయరాజు, పరిశోధన బృందం సభ్యులు డాక్టర్ జి.శ్రీనివాసులు (కొరియ), డాక్టర్ ఎం.మాదక్క, డాక్టర్ ఎం.మంజులత (కొరియా) సహ సంపాదకులుగా రూపొందించిన పుస్తకాన్ని వీసీ ఆచార్య రంగ జనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ఆచార్య ఎన్. జయరాజ్, ఆచార్య వి.సునీత, ఆచార్య రఘుబాబు, ఆచార్య సుదర్శన్‌రాజు, డాక్టర్ శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డిపై దాడి హేయం

కడప ఎడ్యుకేషన్ : విధి నిర్వహణలో భాగంగా అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్య అని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానికంగా వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరు వెంకట శివారెడ్డి, సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్, ఎంఈఓ సంఘం జిల్లా అధ్యక్షులు జాఫర్ సాధిక్, కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, గౌరవాధ్యక్షుడు పాలెం నారాయణలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు మిట్టా క్రిష్ణయ్య పేర్కొన్నారు. కడప పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ఏబీ రామకృష్ణమరాజు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గారి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి వెంకట రమణ, రవిశంకర్, రాష్ట్ర కార్యదర్శులు వారాల శ్రీనివాసులు, ఆదిల్‌బాషాతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

శాసనమండలికి పోటీ చేస్తున్న కొందరు అభ్యర్థులు తమ అనుబంధ విద్యాసంఘాల నేతలను అడ్డుపెట్టుకొని ఇలాంటి దాడులకు పాల్పడటం సిగ్గుచేటని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యంవీ రామచంద్రారెడ్డి అన్నారు.

నెలన్నర తర్వాత స్వస్థలానికి మృతదేహం

అనారోగ్యంతో జనవరి 3న కువైట్‌లో మహిళ మృతి



కువైట్‌లో జ్యోతి మృతదేహం వద్ద ఏపీఎన్‌ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ ఎన్.మహేశ్వర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లె దళితవాడకు చెందిన సగినాల జ్యోతి(31) మృతదేహం నెలన్నర రోజుల తర్వాత స్వస్థలానికి చేరింది. ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ ఏడాది జనవరి 3న కువైట్‌లో మరణించింది. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మూడేళ్ల క్రితం జీవనోపాధి కోసం కువైట్‌లో ఇంటి పని నిమిత్తం వెళ్లిన సగినాల జ్యోతి కువైటీ(సేఠ్) ఇంట్లో పని ఎక్కువగా ఉన్నందున పారిపోయింది. బయట పనులు చేసుకుంటూ ఉండగా, ఆరు నెలల క్రితం అనారోగ్యం బారిన పడింది. తెలిసిన వారి సాయంతో వారి రూములో ఉంటూ జనవరి 3న మరణించింది. ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించాలని వారి బంధువులు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని అభ్యర్థించగా, ఆయన వెంటనే స్పందించి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్‌కు తెలియజేశారు. కువైట్‌లో కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్లు ఎస్.మహేశ్వర్‌రెడ్డి, గోవిందు నాగరాజులు ఆమె మృతదేహాన్ని ఇండియాకు పంపేందుకు భారత రాయబార అధికారులతో మాట్లాడారు. కువైట్ ఇమ్మిగ్రేషన్ వారు పొరపాటున జ్యోతిని శ్రీలంక దేశస్తురాలిగా నమోదు చేయడం వల్ల ఇండియాకు పంపడం చాలా కష్టతరంగా మారింది. ఆమె ఇండియాకు చెందిన మహిళ అని నిరూపించిన తర్వాత, మృతదేహాన్ని పంపేందుకు అయ్యే ఖర్చులు కూడా భారత రాయబార కార్యాలయమే భరించేలా ఒప్పించారు. ఎట్టకేలకు ఈనెల 17న జ్యోతి మృతదేహాన్ని చెన్నై విమానాశ్రయానికి పంపగా, అక్కడి నుంచి వారి బంధువులు స్వస్థలం చింతరాజుపల్లెకు తీసుకెళ్లారు. చెన్నై నుంచి చింతరాజుపల్లెకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించింది.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



శనగలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా

కమలాపురం : ప్రభుత్వం ఏర్పాటు చేసిన శనగ పంట కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కమలాపురం మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ నిర్వహిస్తున్న పప్పు శగన కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వింటా రూ.5,335 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జేడీఏ అయితా నాగేశ్వరరావు, ఏడీఏ ఏవీ నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, వ్యవసాయ, డీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

ప్రొద్దుటూరు : రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మి లబ్ధి పొందాలని ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. రాజుపాళెం మండలంలోని చిన్నశెట్టిపల్లె గ్రామానికి వెళ్లి సచివాలయాన్ని పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ వెంట మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, ఏడీఏ సురేష్‌రెడ్డి, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ప్రొద్దుటూరు ఏఓ శివశంకర్‌రెడ్డి, రాజుపాళెం ఏఓ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు

దువ్వూరు : ఆర్‌బీకేల ద్వారా శనగల కొనుగోలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతులు ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పేర్కొన్నారు. దువ్వూరులో ఆయన శుక్రవారం మాట్లాడుతూ జిల్లాలో జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు, దువ్వూరు కేంద్రాల్లో శనగ పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క రైతు నుంచి 5 క్వింటాళ్లను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

ఒలింపిక్ సంఘం.. ఎన్నికల వైపు అడుగులు

- 19న నిర్వహించేందుకు ఏర్పాట్లు
- అనుమతివ్వని శాప్ అధికారులు

కడప స్పోర్ట్స్ : క్రీడల అభివృద్ధిలో పెద్దన్న పాత్ర పోషించే ఒలింపిక్ సంఘం ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 19న జిల్లా ఒలింపిక్ సంఘం (ఆర్.కె. పురుషోత్తం ప్యానెల్) ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఏపీ ఒలింపిక్ సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలను కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిర్వహించేందుకు అనుమతులు కోరగా, క్రీడా సంఘాల గుర్తింపు విషయంలో స్పష్టత లేకపోవడంతో శాప్ అధికారులు నిరాకరించారు. దీంతో ఈ నెల 19న కడప నగరంలోని కడప ప్రెస్ క్లబ్‌లో ఒలింపిక్ సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో 2018లో ఒలింపిక్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా తోట కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జిలానీబాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో వారు వైదొలగగా, వారి స్థానంలో ఉపాధ్యక్షుడిగా ఉన్న కె.ఎన్.సమరనాథరెడ్డి అధ్యక్షుడిగా, కోశాధికారిగా ఉన్న ఎస్.రాజశేఖర్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ కమిటీ దాదాపు నాలుగేళ్ల పాటు కొనసాగడంతో గతేడాది గడువు పూర్తయింది. అప్పటి నుంచి జిల్లా ఒలింపిక్ సంఘం ఖాళీగా ఉంటూ వస్తోంది. అయితే ఏపీ ఒలింపిక్ సంఘం ఒక్కో జిల్లాలో ఒలింపిక్ సంఘం ఎన్నికలు పూర్తి చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో సైతం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి ఎన్నికల నిర్వహణకు కనీసం రెండు, మూడు వారాల గడువు ఇచ్చి, ప్రకటన జారీ చేయాల్సి ఉంది. అయితే అలాంటి నిబంధనలను పట్టించుకోకుండా ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తుండటం గమనార్హం.

సంఘాల గుర్తింపు సమస్యే?

జిల్లా ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో పాల్గొనే క్రీడాసంఘాలు క్రీడా పాలసీని అనుసరించి రిజిస్ట్రేషన్, టోర్నమెంట్‌ల నిర్వహణ, ఆడిటింగ్, శాప్ గుర్తింపు, ఫెడరేషన్ గుర్తింపు, ఒలింపిక్ సంఘం గుర్తింపు తదితర అంశాలన్నీ సక్రమంగా ఉన్న క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. అయితే క్రీడాసంఘాల్లోని వర్గాల కారణంగా ఒక్కో క్రీడాంశంలో రెండు, మూడు గ్రూపులు ఉండి ఒకరిపై ఒకరు కోర్టుల్లో కేసులు వేసుకుని ఉండటంతో ఎవరికి గుర్తింపు ఉందో, ఎవరికి గుర్తింపు లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో శాప్ అధికారులు జోక్యం చేసుకుని అర్హత కలిగిన సంఘాల ప్రతినిధులే ఎన్నికల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పలు క్రీడాసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

25న టీడీపీ 'సీమ' జిల్లాల సమీక్ష

- చంద్రబాబు రాక
- టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కడప రూరల్ : కడపలో ఈ నెల 25న ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల తెలుగుదేశం పార్టీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమీక్షా సమావేశానికి టీడీపీ అధినేత చంద్రబాబు హాజరవుతారని తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల జాబితా, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష ఉండవచ్చన్నారు. దాదాపు మూడు వేల మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు.

డుమ్మా కొట్టిన ఇన్‌చార్జిలు

సమన్వయ కమిటీ సమావేశానికి జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాయచోటి ఇన్‌చార్జి రమేష్‌కుమార్‌రెడ్డి, బద్వేలు నుంచి ఆ పార్టీ ప్రతినిధి రితేష్‌కుమార్‌రెడ్డి మాత్రమే పాల్గొన్నారు. మిగతా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు సమావేశానికి హాజరు కాకపోవడం గమనార్హం. వారికి వ్యక్తిగత పనులు, ఇతర కార్యక్రమాలు ఏవైనా ఉన్నాయో లేదో తెలియదు గానీ ఈ సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీలు బీటెక్ రవి, శివనాథరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పార్టీ నేతలు గోవర్దన్‌రెడ్డి, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

పరాయి స్త్రీ మోజులో భార్యపై భర్త దాడి



గాయపడ్డ సుజాత

మదనపల్లె : పరాయి స్త్రీ మోజులో పడి కట్టుకున్న భార్యపై భర్త దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలైంది. వేంపల్లె పంచాయతీ బండకిందపల్లెకు చెందిన భాస్కర్, ఆయన భార్య సుజాత(40) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా భాస్కర్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళ మోజులో పడటంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. తరచూ గొడవలు జరుగుతుండటంతో పెద్దమనుషుల సమక్షంలో పలు మార్లు పంచాయితీలు జరిగాయి. అయినప్పటికీ భాస్కర్‌లో మార్పు రాలేదు. గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగి మాటకుమాట పెరిగి తీవ్ర స్థాయికి చేరింది. భార్య సుజాతపై భాస్కర్ విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఇంటి నుంచి గెంటేశాడు. తీవ్ర గాయాలతో బాధపడుతున్న ఆమెను గమనించిన ఇరుగు పొరుగు వారు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్తేమాకు సర్వం సిద్ధం

- నేడు మదనపల్లెలో ప్రారంభం
- రెండు రోజుల పాటు నిర్వహణ
- రెండు లక్షల మందికి పైగా హాజరవుతారని అంచనా
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా



ఇస్తేమా నిర్వహణకు ఏర్పాటవుతున్న చలువ పందిళ్లు

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె పట్టణం.. భారీ స్థాయిలో నిర్వహించనున్న ముస్లిం ధార్మిక సదస్సు ఇస్తేమాకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. శని, ఆదివారాలు (రెండు రోజుల పాటు) జరగనున్న ఇస్తేమాకు రాయలసీమలోని ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన ముస్లింలు సుమారుగా 2లక్షలకు పైగానే హాజరవుతారని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే కదిరి రోడ్డులోని టిప్పుసుల్తాన్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తబ్లీగి–ఏ– ఇస్తేమా ప్రారంభానికి ముందే వేల సంఖ్యలో ముస్లింలు ధార్మిక సదస్సు నిర్వహించే ప్రాంగణానికి చేరుకుని తమ వంతు సాయంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కరోనాతో రెండేళ్లపాటు నిర్వహించలేక పోయిన ఇస్తేమాను ఈసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు శ్రమిస్తున్నారు. ఇస్తేమాకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్‌తోపాటుగా భోజనాల కోసం తాంఖానాలు ఏర్పాటు చేశారు. ఇస్తేమా ఏర్పాట్లు, అతిథులకు కావాల్సిన సౌకర్యాలు, నమాజ్ చేసుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు, వజూ, బాత్‌రూమ్ తదితర వసతులన్నింటికీ పట్టణానికి చెందిన ముస్లింలు వలంటీర్లుగా మారి తమవంతు సేవలందిస్తున్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చే జమాత్‌లు బస చేసేందుకు ప్రత్యేక టెంట్‌లతోపాటుగా నీరు, టాయిలెట్ సౌకర్యం కల్పించారు. శుక్రవారం ఇస్తేమా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రాయచోటి, మదనపల్లె ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా టిప్పుసుల్తాన్ మైదానానికి వచ్చారు. ఇస్తేమా ఏర్పాట్లపై నిర్వాహకులతో చర్చించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయసహకారాలు అందిస్తామని వారు చెప్పారు. ముస్లింలతో కలిసి జుమా నమాజ్‌లో పాల్గొని, అనంతరం వారితో కలిసి అక్కడే భోజనం చేశారు. మౌలికవసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ తదితరాలపై మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. లక్షల సంఖ్యలో ముస్లింలు ఒక చోటకు చేరి ధార్మిక సదస్సు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ధార్మిక సదస్సుకు కులమతాలకు అతీతంగా ఎవరైనా హాజరు కావచ్చన్నారు. కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ అహ్మద్, మదనపల్లె మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్ ఆజం, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, బస్సు ఢీకొని ఇద్దరు మృతి

– ఐదుగురికి తీవ్ర గాయాలు

గాలివీడు: మండలంలోని గోరాన్ చెరువు వద్ద ఆటో, బస్సు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మహబూబ్ బాషా (33), సాధిక్ (11) మృత్యువాత పడ్డారు. ఎస్ఐ వెంకట శివకుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండలం గొట్టివీడులోని ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు శుక్రవారం రాత్రి ఆటోలో గాలివీడుకు వెళ్తున్నారు. మార్గమధ్యలోని గోరాన్ చెరువు గుట్టవద్ద డంపింగ్ యార్డు సమీపంలో ఎదురుగా ఆర్టీసీ బస్సు వచ్చింది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు, పోలీసులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యుల సూచన మేరకు వారిని తిరుపతికి తరలించినట్లు సమాచారం. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు.

నకిలీ వీసాతో మోసపోయిన యువకుడు

- మలేషియాలో పోలీసులకు పట్టుబడిన వైనం
- ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని ఆశ్రయించిన బాధిత కుటుంబీకులు
- ఎంబసీ అధికారులతో మాట్లాడిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చాపాడు : మండలంలోని పడమర అనంతపురం గ్రామానికి చెందిన మోపూరి విజయ్ కుమార్ అనే యువకుడు మలేషియాలో నకిలీ వీసాతో పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం గ్రామానికి చెందిన మోపూరి బెన్నయ్య, సాలమ్మ కుమారుడు మోపూరి విజయ్‌కుమార్ గత నెల జనవరి 11న జీవనోపాధి కోసం మలేషియా వెళ్లాడు. అక్కడ సూపర్ మార్కెట్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో నిబంధనలకు వ్యతిరేకంగా పని చేయాల్సి రావడంతో అక్కడ పని చేయలేక ఇండియాకు తిరిగి వచ్చేందుకు సిద్ధమయ్యాడు. మలేషియాలోని ఎయిర్‌పోర్టుకు వెళ్లగా అక్కడ పరిశీలించిన పోలీసులు నకిలీ వీసాతో వచ్చాడనే కారణంతో విజయ్‌కుమార్ అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు విజయ్‌ని మలేషియాకు పంపిన ప్రొద్దుటూరుకు చెందిన ఏజెంట్ షేక్ జమీర్‌ను సంప్రదించారు. ఏజెంట్ రెండు వారాలుగా కాలయాపన చేస్తున్నాడని, విజయ్‌కుమార్‌ను రప్పించేందుకు తమ దగ్గర రూ.40 వేలు తీసుకుని పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామ పెద్దల ద్వారా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డికి ఈ విషయాన్ని వివరించారు. వెంటనే ఎంపీ మలేషియాలోని ఇండియా ఎంబసీ అధికారి బీఎస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరించి విజయ్‌కుమార్‌ను ఇండియాకు పంపించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు ఎంపీ బాధితుని కుటుంబీకులకు తెలిపారు.